

ట్రాన్స్‌కో ఎఇ శాంతారావు సస్పెన్షన్



ప్రజాశక్తి -మక్కువ

మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పోలాకి శాంతారావును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. గత నెల 27న ఎసిబి దాడి ఘటన అనంతరం జరిగిన అనూహ్య పరిణామాల తర్వాత ఎఇ శాంతారావు శనివారం విధుల్లోకి చేరిన విషయం విదితమే. అయితే ఎఇని మూడు నెలల పాటు సస్పెన్షన్ చేసినట్లు తెలియవచ్చింది. ఎసిబి కేసు నమోదు చేయడం సస్పెన్షన్‌నకు గల కారణంగా తెలుస్తుంది. ఏది ఏమైనా శాంతారావు వ్యవహారం ట్విస్టులకు దారితీసింది.



సర్వేనెంబరు మారిపోయిన భూమి ఇదే

- అటవీ శాఖకు, రైతులకు రెవెన్యూ అధికారుల బురిడీ
- 15 ఏళ్లు సాగులో ఉన్న అసైన్డ్ భూములు ఫారెస్టుకు అప్పగింత
- రైతుల ఆందోళనతో రెవెన్యూ గుట్టు రట్టు

రెవెన్యూ అధికారుల లీలలు రైతులనే కాదు అటవీశాఖాధికారులకు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. సర్వే నెంబర్లనే మార్చేడంతో రైతులు తమ భూములు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. తాజాగా గొట్టివలస వద్ద అసైన్డ్ భూములు రైతుల నుంచి వెనక్కి తీసుకున్న ఘటనలో అటవీశాఖను దోషిగా నిలబెట్టేలా చేసింది రెవెన్యూ శాఖ. ఇలా రెవెన్యూ శాఖ చేతిలో మోసపోవడం అటవీశాఖకు మామూలుగా మారిపోయింది. అదే సమయంలో రెవెన్యూ అధికారుల అసంబద్ధ నిర్ణయం వల్ల 20 మంది రైతుల జీవితాలను రోడ్డు పాల్జేసింది. ఉపాధి నిమిత్తం 2008లో 20 మంది రైతులకు 20 ఎకరాల వరకూ అప్పటి ప్రభుత్వం అసైన్డ్ భూములను అందజేసింది. 15 ఏళ్ల నుంచి సాగులో ఉన్న భూములను ఉన్నపళంగా వెనక్కి తీసుకోవడంతో ఆ రైతులంతా రోడ్డునపడ్డారు. అసైన్డ్ భూముల చట్టం అనుసరించి కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వకుండా అధికారులు ముఖం చాటేశారు.

సర్వే నెంబర్లు ఏమార్చి..!

ప్రజాశక్తి- గరుగుబిల్లి

2008లో అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ భూములను పేద రైతులకు అందజేసింది. దీనిలో భాగంగా మండలంలో గొట్టివలస రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 272, 273, 274లో గల 20 ఎకరాల వరకు 20 మంది రైతులకు అప్పట్లో పంపిణీ చేశారు. ఇందుకు సంబంధించి ఆయా రైతుల పేరున పట్టాలు సైతం అప్పుడే అందజేశారు. అప్పటి నుంచి 15 ఏళ్లగా ఆ భూముల్లో జీడి, మామిడి పంటలు, టేకు సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా పంటల నుంచి రైతులకు దిగుబడి సైతం అందుతోంది. చావు కబురు చల్లాగా చెప్పినట్లు అసైన్డ్ భూములను చెప్పా పెట్టకుండా రైతుల నుంచి తిరిగి తీసుకుంటున్నట్లు అటవీశాఖాధికారులు సెలవిచ్చారు. దీంతో ఏమిచేయాలో పాలుపోక రైతులు జిల్లా అధికారులను ఆశ్రయించారు.

అక్కడి భూములకు బదులుగా...

సాలూరు, పాచిపెంట, కొమరాడ మండలాల గిరిజన ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి అటవీశాఖ నుంచి 79.58 ఎకరాలను రెవెన్యూ అధికారులు తీసుకున్నట్లు తెలిసింది. ఆ భూములకు సమానంగా గొట్టివలసలో రైతుల సాగులో ఉన్న భూములను ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు సిద్ధపడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గొట్టివలస రెవెన్యూ పరిధి లో 279 సర్వే నెంబర్ పేరుతో 79.58 ఎకరాలను అప్పగించడానికి రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. వాస్తవంగా చూస్తే, రైతులకిచ్చిన అసైన్డ్ భూములు గొట్టివలస రెవెన్యూ పరిధిలో 272, 273, 274 సర్వే నెంబర్ లో ఉన్నాయి. వాటిని కూడా రెవెన్యూ అధికారులు 279 సర్వే నెంబరుగా చూపించి, అటవీశాఖ ఇస్తూ రెవెన్యూ అధికారులు నిర్ణయించారు.

నాలుగేళ్ల కిందటే బీజం...

రైతులకిచ్చిన అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుని, అటవీశాఖకు అందజేయాలని నాలుగేళ్ల కిందటే మండల రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలను అప్పటి తహశీల్దార్ శర్మ తయారు చేసి, ఉన్నతాధికారులకు అందజేశారు. ఇపుడు ఆ ప్రతిపాదనలను అమలు చేశారు. ఆరు నెలల కిందట అటవీశాఖాధికారులు అసైన్డ్ భూముల్లోకి వచ్చి సర్వే రాళ్లు వేయసాగారు. అప్పట్లోనే రైతులు సర్వే రాళ్ల పాతడాన్ని అడ్డుకున్నారు. అప్పటి నుంచి ఈవిషయం నలుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట అసైన్డ్ భూముల పరిశీలనకు అటశీఖాధికారులు రావడంతో రైతులు ఘెరావ్ చేశారు.

మభ్యపెట్టి మోసం చేసి...

రైతులు అడ్డుకుంటారని ముందే గ్రహించిన రెవెన్యూ అధికారులు కొత్త సర్వే నెంబర్ 279ను సృష్టించారు. ఆ నెంబర్ లో 79.85 ఎకరాలున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కొత్త సర్వే నెంబర్ విషయం దాచిపెట్టి, రైతులు ఫిర్యాదు చేసిన ప్రతిసారీ సేకరించిన భూములు 279 సర్వే నెంబర్లలో ఉన్నాయని, ఆ భూములు మీవి కావంటూ అధికారులు చెప్పసాగారు. అదే సమయంలో భూముల పరిశీలనకొచ్చిన అటవీశాఖాధికారులను రైతులు అడ్డుకోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ, అటవీశాఖాధికారులు కలిసి రైతులకిచ్చిన అసైన్డ్ భూములను సర్వే చేశారు. 272, 273, 274లో గల 20 ఎకరాలనే 279 నెంబర్ గల సర్వే నెంబర్ లో పేర్కొన్నట్లు గుర్తించారు. కొత్త సర్వే నెంబరు సష్టించిన విషయం అప్పుడు బయటపడింది.

తప్పు నాది కాదు నీదే...

అసైన్డ్ భూములు వెనక్కి ఇవ్వడంపై రాద్ధాంతం జరగడంతో ఆ తప్పిదం నుంచి తప్పుకోడానికి రెవెన్యూ అధికారులు పోటీపడుతున్నారు. తప్పు నాది కాదంటే నాది కాదంటూ ఒకరిపై మరొకరు తోసుకుంటున్నారు. అసైన్డ్ భూములను అటవీశాఖాధికారులకు కేటాయిస్తూ నాలుగేళ్ల కిందట అప్పటి తహసీల్దార్ వీవీఎస్ శర్మ ప్రపోజల్ సిద్ధం చేశారు. ఆ భూముల కేటాయింపుపై ఆయనను 'ప్రజాశక్తి' సంప్రదించగా, కేవలం ప్రపోజల్ వరకు పరిమితమయ్యానని, మిగిలినవేవీ తనకు సంబంధం లేదని చెప్పారు.

రైతుల్లో ఆందోళన...


15 ఏళ్ల కిందట తుప్పలు, రాళ్లతో నిండిన ప్రాంతాన్ని చదును చేసి, సాగులోకి తీసుకొచ్చామని రైతులు తెలిపారు. ఏటా జీడి, మామిడి పంటలతో వస్తున్న ఆదాయంతో తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు. ఇటువంటి సమయంలో భూములు వెనక్కి తీసుకోవ డం సరికాదని రైతులు వాపోతున్నారు. అసైన్డ్ భూముల చట్టం ప్రకారం వెనక్కి తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

రెవెన్యూ వల్ల మోసపోతున్నాం...



రెవెన్యూ ఉద్యోగులను నమ్ముతూ మోసపోతున్నాం. 1993-95 రెండు రిజర్వాయర్ల కోసం అటవీశాఖ భూములకు బదులుగా సాలూరు రేంజ్ పరిధి ముచ్చర్ల వలస, పాలకొండ రేంజ్ జంపర కోట వద్ద భూములను అప్పగించారు. అవి కూడా వివాదాస్పద భూములు కావడంతో, పలువురు అటవీశాఖాధికారులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇపుడు గొట్టివలస రెవెన్యూ పరిధిలోనూ ఇలాగే జరుగుతోంది. భూములు మాకు ఇవ్వాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదే. మిగిలిన విషయాలతో మాకు సంబంధం లేదు. వివాదాస్పద భూములు తీసుకుని, మా భవిష్యత్తును నాశనం చేసుకోలేం.

జిఎపి ప్రసూన, జిల్లా ఫారెస్ట్ అధికారి



కిమ్మిలో ఏనుగుల ధ్వంసం చేసిన చెరుకు పంటను పరిశీలిస్తున్న పాలకొండ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ (ఫైల్)

అదిగో పులి... ఇదిగో ఏనుగులు

కంటిమీద కునుకు లేకుండా కాలం గడుపుతున్న మన్యం ప్రజలు

ప్రజాశక్తి - వీరఘట్టం


ఒడిశాలోని లఖేరా అడవుల నుండి 2007లో ఏనుగుల గుంపు మైదాన ప్రాంతాలకు వచ్చి సుమారు 16ఏళ్లు కావస్తుంది. ఏనుగుల గుంపు సంచారం కారణంగా వందలాది ఎకరాల పంట నష్టంతో పాటు రెండు నిండి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏనుగుల గుంపును జూకు తరలించడంలో పూర్తిగా విఫలమై అయిందని చెప్పాలి. కొద్దిరోజుల కిందట జిల్లాలో పెద్దపులి సంచరిస్తుండడంతో అదిగో పులి...ఇదిగో ఏనుగులు అంటూ చర్చ జరుగుతుండడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత నెల 15న నడిమికెళలో పులి సంచరించినట్లు పాదముద్రల ద్వారా ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. ఈనెల 1న సీతంపేట మండలంలో పులి సంచరిస్తుందని, 2న వీరఘట్టం మండలంలోని మహాదేవివలస, కంబరలో గ్రామస్తుల సమాచార మేరకు ఫారెస్ట్ అధికారులు పాద ముద్రలు పరిశీలించిన పులి సంచరిస్తున్నట్లు గుర్తించడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం కురుపాం మండలంలో పులి సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

పరిహారం కోసం ఎదురుచూపు

ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరఘట్టం మండలంలోని నడుకూరు, కిమ్మి, కొట్టుగుమ్మడ చిట్టపూడివలస ఏనుగుల సంచార కారణంగా సుమారు 12 ఎకరాల్లో మొక్కజొన్న, చెరుకు పంటలు నాశనంతో పాటు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేశాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 15 రోజులు ఏనుగులు గుంపు తిష్ట వేయడంతో ఉపాధి పనులకు, పంటపొలాలకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురైనట్లు ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పంట నష్టాలపై ఈ ఏడాది మార్చి 4న కిమ్మి గ్రామ సచివాలయంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ పంట నష్టపోయిన రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నష్టాలపై వివరాలు సేకరించారు. నెలలు గడుస్తున్నా పంట నష్టపరిహారం అందజేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని బత్తిలిలో 4ఏనుగుల గుంపు, కురుపాం మండలంలో 8 ఏనుగుల గుంపుతో పాటు ఇదే మండలంలో పులి సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఏనుగులు, పులి సంచార జిల్లా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ విషయమై ఆదివారం స్థానిక డిఆర్ఒ బి.రవిబాబు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా పంట నష్టం పరిహారం కు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

పులి సంచారంతో ప్రజలు భయాందోళన

గుమ్మలక్ష్మీపురం : జిల్లాలో ఇటీవల పులి సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలో కంబర, రావివలస, పెద్దబుడ్డిడి పరిసర ప్రాంతాల్లో చుట్టూ పొలాలు, తోటలు ఎక్కువగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు పొలం పనులకు వెళ్లి వస్తుంటారు. పులి సంచారం ఉందని తెలియడంతో బిక్కుబిక్కుమంటూ భయంతో పొలాలకు వెళ్తున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

నిరుద్యోగాన్ని నిర్మూలించాలి

సిపిఎం జిల్లా రెడ్డి వేణు

నేడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద యువత ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

మోడీజీ ఉద్యోగాలెక్కడ... దేశ భవితవ్యం ఎవరిది... నిరుద్యోగంతో దేశాభివృద్ధి సాధ్యమా అని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ, రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారాన్ని నిరుద్యోగ దినంగా పాటిస్తూ స్థానిక సుందరయ్య భవనంలో నిరుద్యోగులతో సదస్సు నిర్వహించారు. యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సదస్సులో రెడ్డి వేణు మాట్లాడుతూ దేశ జనాభాలో 35ఏళ్లలోపు యువత 65 శాతం ఉన్నారని, వీరికి ఉద్యోగం, ఉపాధి కరువై నిరుద్యోగులుగా రోడ్లపై తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీ, పీజీలు చదివిన వారు కూలిపనులకు వెళున్నారన్నారు. మోడీ 2014 ఎన్నికల సందర్భంగా సంత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి గద్దెనెక్కారని తెలిపారు. 2017- 18లో నాలుగు శాతంగా ఉన్న నిరుద్యోగం 2022లో ఏడు శాతానికి పైగా పెరిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో కోటీ 50 లక్షల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారన్నారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పూర్తిస్థాయిలో అమలు చేసేలా పోరాడాలని పిలుపునిచ్చారు. మతోన్మాద మోడీ ప్రభుత్వానికి ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు తప్పదేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని మండిపడ్డారు. జిల్లాలో జ్యూట్, సుగర్, ఫెర్రోఎల్లాయిస్ ఫ్యాక్టరీల మూతవల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్త ం చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ మూతకి మోడీ సిద్ధంగా ఉందని, వాటికి మన రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన వత్తాసుపలకడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమన్నారు. దళిత, గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులు లక్షల సంఖ్యలో ఉన్నా ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. మోడీ సర్కార్ లేబర్ కోడ్లు తెచ్చి కార్పొరేట్లకు రక్షణగా నిలుస్తుందని, ఇది చాలా దుర్మార్గమని మండి పడ్డారు. పాలకులు యువతలో అసంతృప్తిని మతోన్మాదం వైపు మళ్లించి దేశ భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కావున ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, గిరిజన యువతకు స్పెషల్ డిఎస్సి నిర్వహించాలని, పట్టణంలో ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని సదస్సులో వక్తలు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై సోమవారం జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.రాజశేఖర్, డి.పండు, ఎస్.భాస్కరరావు, అన్నాజీ, రమేష్, మహేష్, బి.సూరిబాబు, యువత తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

కురుపాం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. సమరభేరి పేరిట సిపిఎం ఆధ్వర్యాన ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు గ్రామాల్లో ప్రచారంలో భాగంగా మండలంలోని దురిబిలిలో ఆదివారం రాత్రి గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేళాపాలాలేకుండా విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. దీనికి తోడు విద్యుత్‌ఛార్జీలు ప్రతినెలా పెంచుకుపోపోతుందన్నారు. అలాగే చదువుకున్న యువతకు ఉపాధి లేక తీవ్ర అవస్థలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి కల్పించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పువ్వుల పత్తి, పరుశురాం, బిడ్డిక అప్పన్న, రమేష్,నరేసు నీలకంతం ప్రజలు పాల్గొన్నారు.

మన్యం రాజకీయాలపై బొత్స గురి

కోటరీ పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

ఎన్నికలు సమీపిస్తున్న వేళ వరుస టూర్లు

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నంలో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. గడచిన నాలుగేళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించిన బొత్స ఇప్పుడు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తన కోటరీ చెక్కుచెదరలేదని నిరూపించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనిలో భాగంగా గత కొద్ది నెలలుగా బొత్స మన్యం జిల్లాపై దృష్టి సారించడం చర్చనీయాంశమైంది. ఇటీవల కాలంలో జిల్లాలో జరిగిన అధికారిక, అనధికార పార్టీ సమావేశాల్లో బొత్స పాల్గొని తన అనుచరులను కార్యోన్ముఖులను చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అటు విజయనగరం, ఇటు మన్యం జిల్లా లో ఇంతవరకు తన తరపున రాజకీయాలు నడిపిన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావుతో పొసగని నేపథ్యంలో సొంత కోటరీ పునర్నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇంతవరకు అధికారపార్టీలో నడిచిన 'వన్ మాన్ షో' రాజకీయాలకు చెక్ పెట్టాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని కోసం మన్యం జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలకు హాజరవుతూ అనుచరులకు గీతోపదేశం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. కొద్దినెలల క్రితం సాలూరు మండలం మామిడిపల్లిలో వైసిపి సీనియర్ నాయకులు సువ్వాడ తవుడు విగ్రహావిష్కరణకు ఆయన హాజరయ్యారు. ఆ కార్యక్రమం అనంతరం అదే గ్రామానికి చెందిన వైసిపి మండల సీనియర్ నాయకులు సువ్వాడ రమణ మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను ఇంటికెళ్లి పరామర్శించారు. తర్వాత వృద్ధాప్యం రీత్యా అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి తిరుపతినాయుడును బాగువలస వెళ్లి పరామర్శించారు. ఇలా బొత్స ఎక్కడకు వెళ్లినా గతంలో తన అనుచరులుగా ఉన్న వారిని కలుస్తున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని పరామర్శించి ధైర్యం కల్పించడం, మరణించిన నాయకుల కుటుంబ సభ్యులను ఓదార్చడం చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంత్రి బొత్స సత్యనారాయణ తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. మన్యం జిల్లా మంత్రి, డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇప్పటికే ఉన్న గ్రూపు రాజకీయాలు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో బలమైన గ్రూపు నాయకులతో మంతనాలు జరుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ మార్పు అంశం తెరపైకి వస్తోంది. గతంలో చైర్‌పర్సన్ ఎన్నిక ముందు పట్టణానికి చెందిన వైసిపి గ్రూపులు పదవి కోసం పోటీ పడ్డాయి. అప్పుడు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం రాజన్నదొర సమక్షంలో కుదిరిన ఒప్పందం గడువు సమీపిస్తోంది. రెండున్నర ఏళ్ల తర్వాత చైర్‌పర్సన్‌ను మార్చి ఇంకో వర్గానికి చెందిన మహిళా కౌన్సిలర్‌ను ఆ పదవిలో కూర్చోబెడతామని అగ్రనేతలు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఒప్పందం అమలు చేయాలని పట్టణ వైసిపిలో మరో గ్రూపు నాయకులు పట్టు పడుతున్నారు. దీని కోసం వారు జెడ్పీ చైర్మన్, డిప్యూటీ సిఎంలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న వైసిపి గ్రూపు నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణ ఆశీస్సులు కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒప్పందం అమలు కోసం బొత్స వారికి భరోసా ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. రెండు రోజుల క్రితం పార్వతీపురం నియోజకవర్గంలో గడపగడపకూ ప్రభుత్వం ముగింపు కార్యక్రమానికి బొత్స సత్యనారాయణ హాజరయ్యారు. తన అనుచరుడు, ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బొత్స పార్టీ నాయకులు, కార్యకర్తలను చైతన్యపర్చారు. మన్యం జిల్లా రాజకీయాల్లో తన ముద్ర చెరిగిపోకుండా పూర్వవైభవం సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఏమైనా మన్యం జిల్లా రాజకీయాల్లో రానున్న ఎన్నికల ముందు ఆసక్తి కరమైన పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.



అభినందన సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ (ఫైల్)

జ్యూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్షాలు డిమాండ్

ప్రజాశక్తి -సాలూరురూరల్

మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లును 15 నెలలుగా మూసివేసి ఫ్యాక్టరీని తెరిపించడంలో యాజమాన్యం, ప్రభుత్వ అధికారి యంత్రాంగం, తీవ్ర నిర్లక్ష్య ధోరణితో ఉందని, వెంటనే తెరిపించేందుకు చర్యలు చేపట్టకపోతే ఈనెల 7న జీగిరాం నుంచి సాలూరు తహశీల్దార్ కార్యాలయం వరకు కార్మిక కుటుంబాలు, అఖిలపక్షాలతో ర్యాలీ, ధర్నా చేపడతామని అఖిలపక్ష నాయకులు తీర్మానించారు. ఆదివారం కార్మిక జెఎసి నాయకులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పి భంజుదేవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎస్.బంగారయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్ వై నాయుడు, సిపిఐ జిల్లా నాయకులు ఎస్.రామచంద్రరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు జి అప్పలనాయుడు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముక్తేశ్వర పాణిగ్రహి, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం జోనల్ కార్యదర్శి టెక్కలి ధర్మారావు మాట్లాడారు. జ్యూట్ మిల్లును తెరిపించడంలో అధికారి యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉందని, 1200 మంది కార్మికులకు ఉపాధినిచ్చే పరిశ్రమ విషయంలో యాజమాన్యం, అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరారు. లేకుంటే ఈనెల 7న జరిగే ఆందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం దిగురాకుంటే అన్ని పక్షాలతో నిరవధిక ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఎన్.తిరుపతిరావు, రూరల్ అధ్యక్షులు ఎ.పరమేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, బిజెపి పట్టణ అధ్యక్షులు పి విశ్వేశ్వరరావు, ఎపిటిఎఫ్ సాలూరు, పాచిపెంట మండలాల నాయకులు గౌరీ శంకర్రావు, నాయుడు, ప్రభాకర్‌రావు, సిఐటియు పట్టణ అధ్యక్షులు టి రాముడు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

నేటి ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సీతానగరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డిలక్ష్మునాయుడు కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వ్యతిరేకంగా సమరభేరి పేరిట సిపిఎం ఆధ్వర్యాన ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు గ్రామాల్లో ప్రచారం చేసి సచివాలయాల వద్ద ధర్నాలు తెలిపామన్నారు. ఈ ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వేళాపాలాలేకుండా విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



గణపతిని సన్మానిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే జయమణి

గణపతికి సన్మానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలికి చెందిన రంగుముద్రి గణపతి వైసిపి ఇజల్లా కార్యదర్శిగా నిమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి ఆదివారం ఘనంగా నిమించారు. పార్టీ అభివృద్ధికి చేసే కార్యక్రమాల్లో సహకరిస్తామని తెలిపారు. అనంతరం గణపతి మాట్లాడుతూ తనకు ఈ పదవిలో నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ రంగుముద్రి రమాదేవి, పెదబోగిలి వైస్ సర్పంచ్ అరవింద్‌కుమార్, మాజీ ఎంపిటిసి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్మూర్తికి జగదీశ్వరి పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరామ్మూర్తిని పరామర్శిస్తున్న జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

శనివారం రాత్రి పాము కాటు గురై పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు గురాన శ్రీరామ్మూర్తి నాయుడిని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి ఆదివారం ఆస్పత్రి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గూర్చి తెలుసుకొని అనంతరం వైద్య సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆరోగ్యం వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలిపారని ధైర్యంగా ఉండమని ఆయనకు ధైర్యాన్ని ఇచ్చారు.

పెద్దబుడ్డిడిలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెద్దబుడ్డిడిలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో ప్రజలకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా ప్రభుత్వ వైద్య సేవలు కరువయ్యాయని, దీంతో వైద్యం కోసం పార్వతీపురం, పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో గత్యంతరం లేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో పిహెచ్‌సి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కృష్ణను సత్కరిస్తున్న శ్రీశ్రీ ఫౌండేషన్ నిర్వహకులు

ఉత్తమ ఉపాధ్యాయులు కృష్ణకు సత్కారం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని భామినికి చెందిన లోపింటి కృష్ణ ఆదిత్య డిగ్రీ కాలేజీలో గణితం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. శ్రీశ్రీ ఫౌండేషన్ వారు ఆదివారం శ్రీకాకుళంలో లోపింటి కృష్ణకు శాలువాతో సత్కరించి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. ఇటువంటి అవార్డులు వృత్తి పట్ల మక్కువ, గౌరవం, బాధ్యతను పెంచుతాయని కృష్ణ తెలిపారు. కృష్ణకు భామిని గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



గ్రంథాలయంలో చదువుతున్న చిన్నారులు

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథలు చదివించడం, ఆటలు ఆడించడం జరిగింది. గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన్ రావు మాట్లాడుతూ చదువు ఒక్కటే సమాజ అభివృద్ధికి మూలమని, పిల్లలు చదువులో చురుకుదనం చూపించాలని అన్నారు. అలాగే మానసిక ఉల్లాసం కోసం ఆటలు ఆడాలన్నారు. కార్యక్రమంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జెవివి జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జన విజ్ఞాన వేదిక జిల్లా 12వ మహాసభ స్థానిక జిల్లా పరిషత్తు కాంపౌండ్‌లోని మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ జె.చంద్రశేఖర్, జి.నీలయ్య, సింహాద్రి నాయుడు, అధ్యక్షులుగా డాక్టర్ ఎం.వి.ఎన్. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా పి.రమణ ప్రభాత్, సహాధ్యక్షులుగా కె.మురళీబాబు, ఉపాధ్యక్షులుగా పి.వేణుగోపాల్, పి.సత్యం నాయుడు, వి. రాజగోపాల్, జి.నిర్మల, వి.సుశీల, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శులుగా ఎస్.సత్యనారాయణ, డాక్టర్ చిన్నారి, చంద్రశేఖర్, సత్యశ్రీనివాస్, పి.లక్ష్మ నాయుడు, సతీష్, వి.మోహనరావు, కోశాధికారిగా సిహెచ్. సింహాచలం ఎన్నికయ్యారు.

ఆదాయం ఫుల్... సౌకర్యాలు నిల్

కోటదుర్గ ఆలయం దుస్థితి

ప్రజాశక్తి-పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో పేరుగాంచిన కోటదుర్గమ్మ ఆలయానికి ఏటా కోటి రూపాయల వరకు ఆదాయం వస్తుంది. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా ప్రాంతం నుంచి కూడా రోజుకు అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. ఈ ఆలయం విశిష్టత చెప్పలేనిది. వచ్చిన వారు కూడా అధిక మొత్తంలో కానుకలు చెల్లిస్తారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో 10 రోజుల్లోనే వేలాది మంది యాత్రికులు రావడం ఆనవాయితీ. విఐపిల తాకిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. అటువంటి ఆలయంలో సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇంత ప్రతిష్ట కలిగిన ఆలయంలో సౌకర్యాలు లేక అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంది. దీంతో పట్టణ వాసులతో పాటు చుట్టుపక్కల ప్రజలు కూడా పెదవి విరుస్తున్నారు.



రూ.కోటి ఆదాయం....

ప్రతి ఏటా హుండీ ద్వారా దాదాపు రూ.కోటి ఆదాయం సమకూరుతుంది. ఇంతేకాకుండా ఆలయం పేరుతో బ్యాంకు డిపాజిట్లు, బంగారు ఆభరణాలు కూడా లెక్కలేనంత ఉన్నాయి. అయితే ఆలయంలో ఆశించినంత సౌకర్యాలు మాత్రం లేవు. ఆలయంలో కార్యనిర్వహణాధికారి జీతం తప్ప మిగిలిన వారి జీతాలు ఆలయం నుంచే ప్రతి నెల డ్రా చేస్తున్నారు. సుమారు ప్రతి నెలా జీతాలతో పాటు ఆలయ నిర్వహణకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆలయ అభివృద్ధిపై నీలినీడలు అలముకుంటున్నాయి.

సౌకర్యాలు కరువు...

ఆలయంలో కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. ఆలయానికి వచ్చిన యాత్రికులకు స్నానాల గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గదుల సదుపాయం కూడా లేదు. వచ్చిన వారు ఎక్కడ తలదాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆలయంలో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధిపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

జోరుగా పర్యాటక అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యాటక ప్రాంతం అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల సంక్షేమం, సౌకర్యం కోసం రూ.2కోట్లతో సవరకోటపాడు నర్సరీలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. పర్యాటకులు స్థానికంగా రెండు, మూడు రోజులుండేందుకు వీలుగా స్పెషల్ కాటేజీలు నిర్మిస్తున్నారు. మరోవైపు బోటు షికారు, చిన్నపిల్లల పార్క్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉండేలా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. నర్సరీ అభివృద్ధి పనులను ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రతిఏటా నవంబర్, డిసెంబర్‌లో వనభోజనాల కోసం తాడికొండ, సవరకోటపాడు పర్యాటక ప్రాంతాలకు పార్వతీపురం, శ్రీకాకుళం, ఒడిశా దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తాకిడి పెద్ద సంఖ్యలో కనిపిస్తోంది.



సవరకోటపాడు వద్ద నిర్మిస్తున్న కాటేజీలు

గొయ్యిపాకలో భవిష్యత్తు గ్యారెంటీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాబు ష్యూర్టీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై మండలంలోని పెంగవ, గొయ్యపాక గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని అన్నారు. టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో మహిళలు, విద్యార్థులు, యువత, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో టిడిపికి బలం పెరిగిందని రానున్న ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కిల్లక దాసు, యూనిట్ ఇన్‌ఛార్జి పువ్వల కోటి, మహిళా అధ్యక్షులు నాగవేణి తదితరులు ఉన్నారు.



కురుపాంలో ప్రచారం చేస్తున్న టిడిపి మండల కన్వీనర్ కొండయ్యబాబు

కురుపాం : మండలంలో మొండెంఖల్లోలో ఆదివారం టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య బాబు ష్యూర్టీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి పథకం ఆవశ్యకత గూర్చి వివరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడును గెలిపిస్తే ప్రజల భవిష్యత్తుకు ష్యూర్టీ ఉంటుందని కావున టిడిపి గెలిపించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ కోప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, సాయి,సుక్కు తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో ప్రచారం చేస్తున్న టిడిపి మండల న్వీనర్ మధుసూదనరావు

గరుగుబిల్లి : మండలంలోని రావివలసలో బాబు ష్యూర్టీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూదన్‌రావు, టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి ఎం.పురుషోత్తమ నాయుడు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు కోట సుమన్ (భరత్)ఆధ్వర్యంలో జరిగింది. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశాన్ని గెలిపించి భవిష్యత్తుకు బాట వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొర్ల కిషోర్, జి.భానుమూర్తి, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పాడుకు రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

షేక్‌పాడు గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ షేక్‌పాడు గిరిజన గ్రామంలో సుమారు 40 కుటుంబాలు జీవిస్తున్నారని, ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేక చిన్నగొడ్జి ద్వారా ప్రజలు రాకపోక సాగిస్తున్నారని తెలిపారు. గుమ్మిడి గూడ ప్రధాన రహదారి నుంచి షేక్‌పాడు గిరిజన గ్రామానికి సుమారు కిలోమీటర్ మేరకు రహదారి నిర్మిస్తే గిరిజన ప్రజలు రవాణా సౌకర్యం కల్పించినట్లు అవుతుందని తెలిపారు. అత్యవసర సమయంలో వైద్య పరంగా కనీసం 108 వాహనం కూడా వెళ్లే అవకాశం లేదన్నారు. కిలోమీటర్ మేరకు ప్రధాన రహదారి వద్దకు మోసుకొని వచ్చి 108 వాహనం కానీ ఆటో కానీ ఎక్కించాలని తీసుకెళ్లే పరిస్థితులు ఉన్నాయన్నారు. కావునా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.



అధ్వానంగా ఉన్న షేక్‌పాడుకు వెళ్లే రోడ్డు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ శ్యామసుందర్

వెంకటబైరిపురంలో బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - మక్కువ

టీచర్స్ డే సందర్భంగా టీచర్స్ ట్రోఫీ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆదివారం వెంకటబైరిపురంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ టోర్నమెంట్‌ను ఎంఇఒ-2 శ్యామ్ సుందర్ ప్రారంభించిన అనంతరం ఆయన కూడా ఆటల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతి మరడ శ్రీనివాసరావు, దుర్గా ప్రసాద్, ద్వితీయ బహుమతి గోపి, శ్రీరాములు గెలుపొందారు. అలాగే సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానంలో చిరంజీవి, ద్వితీయ స్థానంలో పాటూరి ఈశ్వరరావు గెలుపొందారు. కార్యక్రమంలో మక్కువ మండలానికి చెందిన సుమారు 30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9,10న రంగం రాష్ట్ర మహాసభలు

విజయనగరం కోట : ఈ నెల 9, 10వ తేదీల్లో కర్నూలులో రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నారని జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.షణ్ముఖరావు, గోకా రమేష్‌బాబు, డప్పు శ్రీను తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఏర్పడి ఐదేళ్లయిందని చెప్పారు.

వాలంటీర్ పనితీరు పట్ల హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వాలంటీర్ పనితీరు పట్ల పెన్షన్‌దారుని కుటుంబ సభ్యులతో పాటు, సంబంధిత వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బెలగాంలో నివాస ముంటున్న ఏగిరెడ్డి సింహాచలం అనారోగ్యం బారిన పడి మెరుగైన చికిత్స కొరకు గత కొన్ని రోజులుగా విశాఖ పట్నం కెజిహెచ్‌లో ఉన్నారు. ఈనెల 1న ఆయనకు ఇవ్వాల్సిన వృద్ధాప్య పెన్షన్‌ను వైద్య సహాయం కొరకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఆ వార్డు వాలంటీర్ బొమ్మిడి మల్లేష్ స్థానిక కౌన్సిలర్ సంగిరెడ్డి లక్ష్మీపార్వతికి చెప్పగా, విశాఖపట్నం వెళ్లి పెన్షన్ అందజేయాలని ఆమె సూచన మేరకు ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లి పెన్షన్ అందజేశారు. వాలంటీర్ చేసిన సహాయానికి వృద్ధుని కుటుంబ సభ్యులతో పాటు, వార్డు కౌన్సిలర్, స్థానికులు వాలంటీర్‌కు కృతజ్ఞత తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింహాచలంకు పింఛను ఇస్తున్న వాలంటీరు



విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్తు బిల్లులు దగ్ధం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యుత్ బిల్లు తగ్గించే వరకు పోరాటం ఆగదని సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధానరహదారిలో ప్రదర్శన, ప్రచారం చేసి, బందం వారి వీధి జంక్షన్ వద్ద వ్యక్తిగత విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇఎల్ఆర్ పేరుతో చేస్తున్న విద్యుత్ కోతలు నిలిపివేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరెంటు బిల్లులు అనేక పద్ధతుల్లో పెంచి ప్రజలపై ఆర్థికభారాలు వేస్తున్నారని అన్నారు. నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఉపాధి, పనికితగ్గ వేతనం లేక ఆర్థిక ఇబ్బందుల్లో ప్రజలున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేయడం సరికాదన్నారు. అన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 4 (సోమవారం) స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ప్రభుత్వ వ్యతిరేకతను తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిహెచ్.లక్ష్మణరావు, టి.శ్రీను, టి.బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీకి గంటందొర, మల్లుదొర పేర్లు పెట్టాలి


ప్రజాశక్తి - కురుపాం

గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు గిరిజన స్వతంత్ర సమరయోధులైన గంటం దొర, మల్లు దొర పేర్లు పెట్టాలని ట్రైబల్ రైట్స్ ఫోరం మన్యం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విశ్వవిద్యాలయంలో ఆదివాసీలకు ఉపయోగపడే కోర్సులు తీసుకొచ్చి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి ఉపయోగపడే కోర్సుల్ని ప్రవేశపెట్టాలన్నారు. గత ప్రభుత్వ హయంలో కొత్తవలస సమీపంలో రెల్లిలో భూములు కేటాయించి ఐటిడిఎ నిధులతో చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి విడిచిపెట్టారన్నారు. ఇప్పటికైనా పక్కా భవనాలు నిర్మించి గిరిజన విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందడంలో ముఖ్యపాత్ర పోషిస్తూ గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఏ రిక్రూమెంట్ జరిగినా గిరిజనులకు 50శాతం కేటాయించి మిగిలినవి అన్ని కులాలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ నిర్ణయంతో గిరిజనులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో ఉన్న బుడగ జంగం, వాల్మీకి, బెంతు ఒరియా, ఏనేటి కొందు సామాజిక వర్గాలకు వైఎస్ఆర్ చేయూత పథకానికి కుల ధ్రువీకరణ పత్రం లేకపోయినా సెల్ఫ్ డిక్లరేషన్‌తో పెట్టుకోమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం విచారకరమని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు అన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్‌తో నిజమైన లబ్ధిదారులు నష్టపోవడంతో పాటు నకిలీలు ఎక్కువమంది ప్రవేశించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని నిజమైన అర్హులకు వర్తింపచేయాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆదివాసీ తెగలో నకిలీలు చేరి నిజమైన ఆదివాసీలకు పథకాలు అందకుండా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఒక్క పథకానికే పరిమితం కాకుండా అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో నకిలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, దీంతో నిజమైన ఆదివాసీలు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.



పాఠశాల వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదపుటంచున ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రేగిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ప్రమాదం అంచున ఉంది. వందలాది మంది విద్యార్థులు తిరిగే ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్ఫార్మర్ దిగువ స్థాయిలో ఉండడం, కురుస్తున్న వర్షాలకు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విద్యుత్ షాక్ జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె నిర్మాణం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తుప్పలను తొలగిస్తున్న ఎస్ఐ నీలకంఠరావు

ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి - సీతంపేట

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఆదివారం సీతంపేట నుండి పాలకొండ వైపు వెళ్లే మెయిన్ రోడ్‌లో మలుపుల వద్ద ఉన్న దట్టమైన పొదలను జెసిబి సాయంతో కుసిమి జంక్షన్ వద్ద ఎస్సై ఎ నీలకంఠరావు తన సిబ్బందితో పొదలను తొలగించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడిపి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -బలిజిపేట

వంగర మండలం కొండచాకరాపల్లికి చెందిన యాలకుల పాపినాయుడు (45) పురుగుమందు తాగి మృతి చెందినట్లు బలిజిపేట ఎస్సై ఎన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పాపినాయుడు గత కొన్నేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడని, తరచూ ఈ వస్తుందని మనస్థాపన చెంది తండ్రికి నారాయణపురం వెళ్లి మూర్ఛ నివారణకు మందులు కొనుక్కుంటానని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే మార్గంలో సువర్ణముఖి నది వద్ద గడ్డి మందు తాగి మరణిస్తున్నట్లు తన తమ్ముడికి తెలిపాడు. వెంటనే విషయం తెలుసుకున్న అతని తమ్ముడు, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని రాజాం హాస్పిటల్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతి చెందిన పాపినాయుడు